ఆంధ్రజ్యోతి

గరిష్టం : 26.5
కనిష్టం : 16.0

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

మంగళవారం 18 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.20 (301.3570)	16,735	16,735
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.10 (4.22)	1,377.71	1,377.71
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.886)	1,000	8,000

చికెన్ ధరలు	లైవ్ : రూ.140	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.240



చింతలపాలెంలోని జిన్నింగ్ మిల్లు



కొనుగోళ్లకూ కష్టం

- బంద్ పాటిస్తున్న జిన్నింగ్ మిల్లు యజమానులు
- ఏరిన పత్తి నిల్వ చేసినా తేమ శాతం పెరిగే అవకాశం
- సీసీఐ నిబంధనలతో రైతులు, జిన్నింగ్ మిల్లు యజమానులకు ఇబ్బంది
- కొనుగోళ్లు ప్రారంభించిన 10 రోజులకే సమ్మె

ఆరుగాలం రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటను విక్రయించుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిద్దామంటే అడ్డికి పావుశేరు అన్నట్టుగా తక్కువ ధరకు కొనడంతో పాటు తరుగు, తేమ, కమీషన్ పేరిట కోతలు పెడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిద్దామంటే కొర్రీల మీద కొర్రీలు. తాజాగా పత్తి కొనుగోళ్లపై తీవ్ర గందరగోళం నెలకొంది. పత్తి కొనుగోలుకు సీసీఐ పెడుతున్న కొర్రీలపై పత్తి రైతులు, పత్తి మిల్లుల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ నిబంధనలను నిరసిస్తూ జిన్నింగ్ మిల్లుల యజమానులు మిల్లులు మూసివేసి నిరవధిక బంద్ పాటిస్తున్నారు. దీంతో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి.

- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు/చింతలపాలెం)

సీసీఐ పత్తి మిల్లుల సామర్థ్యం, మౌలిక వసతుల ఆధారంగా ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరీలుగా విభజించింది. పత్తి కొనుగోలుకు కొన్నింటికి అనుమతించి, మరి కొన్నింటికి అనుమతి ఇవ్వక పోవడంపై వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అనుమతి ఇచ్చిన కొనుగోలు కేంద్రాల్లో కొన్ని ఈ నెల 4 నుంచి ప్రారంభం కాగా, అప్పుడొకటి, ఇప్పుడొకటి అన్నట్టుగా మరికొన్ని ఇంకా ప్రారంభమవుతూనే ఉన్నాయి. సీసీఐ నిబంధనలను సవరించాలని జిన్నింగ్ మిల్లు యజమానులు మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నారు. అయినా సీసీఐ దిగిరాకపోవడంతో ఈ నెల 6 నుంచే జిన్నింగ్ మిల్లుల బంద్‌కు జిన్నింగ్ అండ్ కాటన్ ఇండస్ట్రీ అసోసియేషన్ పిలుపునిచ్చింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జోక్యం చేసుకుని తాను సీసీఐతో మాట్లాడి రైతులకు, మిల్లర్లు నష్టం కలుగకుండా చూస్తానని హామీ ఇవ్వడంతో మిల్లర్లు బంద్ ప్రతిపాదనను విరమించుకున్నారు. 10 రోజులు గడిచినా సమస్య పరిష్కారం కాలేదు. ఎల్-1, ఎల్-2 (కొన్ని) జిన్నింగ్ మిల్లులకే పత్తి కేటాయిస్తున్నారు. దీంతో జిన్నింగ్ మిల్లుల యజమానులు తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం(ఈ నెల 17) నుంచి జిన్నింగ్ మిల్లులు మూసివేసి నిరవధిక బంద్ పాటిస్తున్నారు.

కపాస్ కిసాన్‌తో అవస్థలు

అక్రమాలకు చెక్ పెట్టాలన్న ఆలోచనతో సీసీఐ కపాస్ కిసాన్ యాప్ తెచ్చింది. ఈ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని రైతులు తమ పత్తిని జిన్నింగ్ మిల్లులకు తీసుకెళ్లాలి. రైతుల్లో చాలా మందికి స్మార్ట్ ఫోన్లు లేకపోవడంతో వారు స్లాట్ బుక్ చేసుకోలేకపోతున్నారు. స్మార్ట్‌ఫోన్ ఉన్నవారినో, మధ్య దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఎన్నిసార్లు బుక్ చేసినా స్లాట్ బుక్ కావడం లేదంటున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 7.65లక్షల ఎకరాల్లో పత్తి సాగు...

యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,13,193 ఎకరాల్లో, సూర్యాపేట జిల్లాలో 83,927 ఎకరాల్లో, నల్లగొండ జిల్లాలో 5.68 లక్షల ఎకరాల్లో మొత్తం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 7,65,120 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది అధిక వర్షాలతో పత్తి చేలు దెబ్బతిన్నందున ఎకరాకు సగటున 9 క్వింటాళ్ల చొప్పున..

- మిగతా 8వ పేజీలో...

స్లాట్ బుక్ కావడం లేదు



నేను 23 ఎకరాల్లో పత్తి సాగు చేశా. పత్తి ఏరించి ఆరబెట్టా. 10 రోజులుగా ఇప్పటికి 20సార్లు ప్రయత్నించినా పత్తి విక్రయించడానికి స్లాట్ బుక్ కాలేదు. ఇప్పటివరకు నేను విక్రయించలేదు. ఇప్పుడేమో జిన్నింగ్ మిల్లుల యజమానులు సమ్మె చేస్తున్నారు. పత్తి కుప్పగా పోసినందున మళ్లీ అందులో తేమ శాతం పెరుగుతుంది. మళ్లీ ఆరబెట్టాలంటే ఖర్చు అదనంగా మీద పడుతుంది. వెంటనే జిన్నింగ్ మిల్లుల యజమానులు పత్తి కొనేలాచర్య తీసుకోవాలి.

- ఎలుగు సత్తయ్య, పత్తి రైతు, దత్తప్పగూడెం)

ఎకరాకు ఏడు క్వింటాళ్లే...

సీసీఐ నిబంధన మేరకు ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొంటామంటోంది. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా ఏడు క్వింటాళ్లే కొనుగోలు చేస్తామనడంతో మిగతా పత్తి ఎక్కడ విక్రయించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈసారి అధిక వర్షాలతో పత్తి పంట దెబ్బతిన్నదని అనుకున్నా ఎకరాకు కనీసం 10 క్వింటాళ్ల వరకు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా తేమ శాతం 8 నుంచి 12 వరకు ఉంటేనే కొంటున్నారు. అయితే 16 తేమ శాతం ఉన్నా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు



అర్వపల్లిలో కాంటాలు వేస్తున్న హమాలీలు

అర్వపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జాజిరెడ్డిగూడెం మండలంలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలంలో 26 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సోమవారం నాటికి 72 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలుచేశారు. ఎలాంటి లారీల కొరత లేకుండా ఎప్పటికప్పుడు ధాన్యాన్ని ఎగుమతి చేస్తున్నారు. రహదారులపై పోసిన ధాన్యాన్ని కూడా వెనువెంటనే లారీల్లోకి ఎత్తి తరలిస్తున్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో 14, పీఏసీఎస్ 4, మ్యాక్స్ 2, టీఎంటీసీ 3, మిగతా మూడు కేంద్రాలల్లో ధాన్యం కొనుగోలు కొనసాగుతున్నాయి. రైతులు వరి కోత కోసి ధాన్యాన్ని కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇంకా వరి కోతలు నడుస్తూనే ఉన్నాయి. ఏ -గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2383, బీ-గ్రేడ్ ధాన్యానికి రూ.2363గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. దీనికి తోడు సన్న ధాన్యానికి క్వింటాకు అదనంగా రూ.500బోనస్ ఇస్తుండడంతో రైతులు ఆసక్తిగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలిస్తున్నారు.

సజావుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి 17 శాతం తేమతో కొనుగోలు చేస్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నాం.

- శ్రీకాంత్, తహసీల్దార్, జాజిరెడ్డిగూడెం మండలం

కూరగాయల వ్యాపారుల

కష్టాలు తీరేనా!

- ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వినియోగంలోకి వచ్చేనా

6

తనిఖీల సమయంలో అప్రమత్తంగా ఉండాలి



నాగారం బంగ్లా హైవేపై ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

నాగారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రహదారులపై తనిఖీలు చేస్తున్న పోలీసుసిబ్బంది జాగ్రత్తలు పాటించి, అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ నర్సింహ అన్నారు. సోమవారం మండలంలోని నాగారం బంగ్లా నేషనల్ హైవేపై శనివారం జరిగిన కారు ప్రమాదంలో కానిస్టేబుల్ కమలాకర్ మృతిచెందిన ప్రదేశాన్ని ఎస్పీ పరిశీలించారు. ప్రమాద సమయంలో ఉన్న వాహనాదారులను, ప్రత్యక్ష సాక్షులను విచారించారు. హైవేలపై లైటింగ్ ఉన్న ప్రదేశంలో చిన్న బారికేడ్ ఏర్పాటుచేసుకొని వాహనాల వేగ నియంత్రణ చేసిన తర్వాత తనిఖీలు చేపట్టాలన్నారు. అదేవిధంగా నాగారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసే నూతన పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాల ఏర్పాటుకు ఎస్పీ నర్సింహ స్థల పరిశీలన చేశారు. వర్ధమానుకోట రెవెన్యూ పరిధిలోని నాగారం బంగ్లాలోని ఆర్‌అండ్‌బీ స్థలాన్ని, విజయ్‌నగర్ వద్ద ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. అనువైన ప్రదేశాన్ని గుర్తించాలని తహసీల్దార్ హరికిషోర్ శర్మను ఆయన కోరారు. ఎస్పీ వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ నాగేశ్వరరావు ఉన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

సూర్యాపేట క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ నర్సింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్‌డేలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, మాట్లాడారు. చట్టాన్ని అమలుచేయడంలో ఎలాంటి అలసత్వం చూపవద్దన్నారు. ప్రతీ కేసును పారదర్శకంగా విచారణ చేపట్టాలన్నారు.

చలిలో ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించాలి

శీతాకాలం సందర్భంగా జిల్లావ్యాప్తంగా చలి తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రజలు ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ నర్సింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెల్లవారుజామున చలి ప్రభావం, పొగమంచు, ఎక్కువగా ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు లైటింగ్ కండీషన్ చూసుకోవాలని, తక్కువ వేగంతో వాహనాలను నడపాలన్నారు. ఓవర్‌టెక్ చేయవద్దన్నారు. వాహనాల మధ్యలో దూరం పాటించాలన్నారు.

రెండు రోజుల్లో ధాన్యం డబ్బులు జమచేయాలి

కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్

సూర్యాపేట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లో రైతుల అకౌంట్లలో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం మండలంలోని గాంధీనగర్, యర్కారం, బాలెంల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. తేమ శాతం కొలిచే యంత్రం, రిజిస్టర్‌ను పరిశీలించారు. తేమశాతం 17 వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి మిల్లులకు తరలించాలన్నారు. వెంటనే ట్రక్‌షీట్, ట్యాబ్ ఎంట్రీ చేసి రైతులకు సకాలంలో డబ్బులు జమయ్యేలా చూడాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో మోహన్‌బాబు, డీఎం రాము, తహసీల్దార్ కృష్ణయ్య, ఏవో సందీప్, ఏపీఎం, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):ప్రజావాణి అర్జీలపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను స్వీకరించి, మాట్లాడారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరై అర్జీల పరిష్కారానికి శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వారం రోజుల్లో అర్జీల పరిస్థితిపై సమీక్ష చేస్తానన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామరావు,ఆర్డీవో వేణుమాధవ్, మహిళా సంక్షేమ అధికారి కే నర్సింహారావు, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, ఇరిగేషన్ అధికారి, జడ్పీ డిప్యూటీ సీఈవో శిరీష, డీఎస్‌సీడీవోకె దయానందరాణి, డీపీవో యాదగిరి, డీఈవో అశోక్, డీఐవో భానునాయక్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల రహిత తెలంగాణ పోస్టర్ ఆవిష్కరణ

బాల్య వివాహాల నియంత్రణ అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఈ నెల 1వ తేదీ నుంచి డిసెంబరు 1వతేదీ వరకు 30రోజులు బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

రైతులకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు భూమి సునీల్

తుంగతుర్తి, నాగారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం చేసే ప్రతి రైతుకూ సాగు చట్టాలపై అవగాహన ఉండాలని భూచట్టాల నిపుణుడు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ అన్నారు. లిఫ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ సాగు న్యాయ యాత్రలో భాగంగా సోమవారం తుంగతుర్తి, నాగారం మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలిస్తేనే నిజమైన సాగు న్యాయం సాధ్యమవుతుందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలు, నాణ్యతలేని విత్తనాలు, ఎరువులు, మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భూవివాదాల పరిష్కారానికి రైతులు కోర్టుల చుట్టు తిరిగి ఇబ్బంది పడుతున్నారని, భూభారతిలో సత్వర పరిష్కారానికి జిల్లాకు రెండు నుంచి మూడు రెవెన్యూ ట్రిబ్యూనల్స్ ఏర్పాటు చేసి భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ప్రపంచంలో పలు దేశాల్లో భూచట్టాలను రైతులు సమర్థంగా వినియోగించుకుంటూ లబ్ధి పొందుతున్నారని, అలాంటి అవగాహన మన రైతులకూ ఉండాలన్నారు. ప్రస్తుతం దేశంలో 200కుపైగా భూ చట్టాలు ఉన్నాయని, అవి రైతులకు ఉపయోగపడేలా అవగాహన కల్పించడమే యాత్ర లక్ష్యమన్నారు. అనంతరం గొట్టిపర్తిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, తుంగతుర్తిలోని వరి పొలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, లిఫ్స్‌సంస్థ ప్రతినిధులు, అద్వకేట్లు జీవన్, రవి, అభిలాష్, సందీప్, దాయం కరుణాకర్‌రెడ్డి, కేతిరెడ్డి కరుణాకర్ రెడ్డి, ఏడీఏ రమేష్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ యాదగిరి, ఆర్‌ఐలు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, నాగారం నాయబ్ తహసీల్దార్ వసీమాబేగం, గిర్దావర్ బాబు, షఫీ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

బక్కయ్యగూడెం రేషన్‌షాపులో

నాసిరకం బియ్యం

లబ్ధిదారుల ఆందోళన



బక్కయ్యగూడెంలో నాసిరకం రేషన్ బియ్యం

నేరేడుచర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెం గ్రామంలోని రేషన్ దుకాణంలో నాసిరకం బియ్యం రావడంతో లబ్ధిదారులు ఆందోళన చేశారు. పురుగులు, బూజు పట్టిన బియ్యం రేషన్ దుకాణాలకు సరఫరా చేశారు. ఈ బియ్యాన్ని డీలర్ పంపిణీ చేయడం వివాదాస్పదంగా మారింది. ఇదిలా ఉండగా డీలర్ కోణ సత్యం మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నవంబరు నెలలో నాణ్యత లోపంతో బియ్యం వచ్చాయి. మా వద్ద ఎలాంటి తప్పు లేదన్నారు.

నాణ్యమైన బియ్యం సరఫరా చేసేలా చర్యలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నాణ్యమైన బియ్యం సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. తూకాల్లో తేడాలు వస్తున్నాయని డీలర్లు నా దృష్టికి తీసుకువచ్చారు. సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

- సైదులు, తహసీల్దార్

త్వరగా ధాన్యాన్ని ఎగుమతి చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ జ్ఞానేశ్వరీదేవి

ఆత్మకూరు(ఎస్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్న నైపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎప్పటికప్పుడు కాంటాలు పూర్తి చేసి త్వరగా ధాన్యం బస్తాలను ఎగుమతి చేయాలని సూర్యాపేట ఏడీఏ జ్ఞానేశ్వరీదేవి అన్నారు. సోమవారం మండలంలోని ఏనుబాముల ఐకేపీ కేంద్రం, నెమ్మికల్ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. తేమ శాతం 17 కంటే తక్కువ ఉండేలా రైతులు ధాన్యం ఇంటి వద్దనే ఆరబెట్టుకొని కొనుగోలుకేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు, ఎంత ధాన్యం మిల్లులకు తరలించారు అని ఏవో దివ్యను అడిగి తెలుసుకున్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈవో శివకుమార్, గౌస్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో కార్తీక పూజలు



కీతవారిగూడెంలో అమ్మవారిని తాకిన సూర్యకిరణాలు, హుజూర్‌నగర్‌లో రుద్రాభిషేకం

మేళ్లచెర్వు, సూర్యాపేటరూరల్, గరిడేపల్లి, హుజూర్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా మేళ్లచెర్వు మండలకేంద్రంలోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఈవో శంభిరెడ్డి, అర్చకులు, విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, చైర్మన్ శంభిరెడ్డి పాల్గొన్నారు.

అభిషేకంలో పాల్గొన్న డీటీసీ వాణి

సూర్యాపేట పరిధిలోని పిల్లలమర్రి శివాలయాలను డీటీసీ డాక్టర్ వాణి సందర్శించారు. త్రికూటాలయంలో నందీశ్వరుడిని పంచామృతాలతో అభిషేకించారు. దేవాలయ కమిటీ సభ్యులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఆమె వెంట డీటీవోలు జయప్రకాష్‌రెడ్డి, లావణ్య, ఎంవీఐలు కొండయ్య, ఆదిత్య, సిబ్బంది ఉన్నారు.


అమ్మ వారిని తాకిన సూర్యకిరణాలు

గరిడేపల్లి మండలం కీతవారిగూడెం శివాలయంలో అమ్మవారిని సూర్య కిరణాలు తాకినట్లు ఆలయ పూజారి శ్రీరామయ్యశర్మ తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష పూజలతో పాటు అమ్మవారికి సహస్రనామ కుంకుమపూజలు నిర్వహించారు.

లక్ష రుద్రాక్షలతో అభిషేకం

హుజూర్‌నగర్‌లోని భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో లక్షరుద్రాక్షలతో అభిషేకం నిర్వహించారు. అంతకుముందు రుద్రాక్షలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో గుజ్జుల కొండారెడ్డి, గజ్జి ప్రభాకర్‌రావు, కీతా మల్లికార్జున్‌రావు, గుండా శ్రీనివాసు, కంచర్ల అరవిందరెడ్డి, ఏలూరి రాంబాబు, నర్సింహారావు, సైదులు, క్రాంతి, దీకొండ వెంకటేశ్వర్లు సుబ్రహ్మణ్యశర్మ, రెంటాల శ్రీనివాసశర్మ, దీకొండ వెంకటేశ్వర్లు, అమర్‌నాథ్‌రెడ్డి, జూలకంటి ఉపేందర్, ఉప్పల రామ్‌నరేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే ఉపసంహరించుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

సూర్యాపేటటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నెల 23వతేదీన జరిగే మాలల రణభేరి మహాసభ కరపత్రాలు సోమవారం సూర్యాపేటలోని రైతుబజార్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. సుప్రీంకోర్టు సూచనలకు విరుద్ధంగా 2011జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేసి మాలలకు అన్యాయం చేశారని తెలిపారు. మాలల కోసం ప్రత్యేక మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000కోట్లు కేటాయించాలన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులపై శ్వేతపత్రం విడుదల చేసి, నిధులు ఖర్చు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రోస్టర్ పాయింట్లను సవరించాలని, ఈకారణంగా మాలలకు 5శాతం ఉద్యోగ అవకాశాలు దక్కకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పంగ రెక్కల సంజయ్, జిల్లా అధ్యక్షుడు బొల్లెద్దు వినయ్, అనుములపురి కృష్ణ సరళ, సుమలత, మధుబాబు, సావిత్రి, రవికాంత్, లలిత పాల్గొన్నారు.



ఏజెన్సీల మధ్య ఆధిపత్య పోరు

● మోడల్ స్కూల్ ఉద్యోగులకు వేతనాల వేతలు ● 8 నెలలుగా వేతనాల కోసం ఎదురుచూపులు ● ఏజెన్సీల మధ్య రగడతో నిలిచి వేతనాలు

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

సూర్యాపేట జిల్లాలో రెండు ప్రధాన పార్టీలకు చెందిన అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకుల ఆధిపత్య పోరు మోడల్‌స్కూల్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు శాపంగా మారింది. ఎనిమిది నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మఠంపల్లి, మునగాల, నడిగూడెం, తిరుమలగిరి, అనంతారం, ఇమాంపేట, తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్), గడ్డిపల్లిలలో మోడల్ స్కూల్స్ ఉన్నాయి. 2013లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఫిజికల్ డైరెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్, అంటెడర్, నైట్‌వాచ్‌మన్‌లుగా నలుగురు చొప్పున నియమితులై విధులను నిర్వహిస్తున్నారు. వీరందరికీ సకాలంలో వేతనాలు అందడం లేదు. ఈ విద్యా సంవత్సర ప్రారంభంలో ఏజెన్సీల మధ్య వివాదాలతో వేతనాలు నిలిచిపోయాయి. రాజకీయ ప్రాబల్యం కలిగిన ఏజెన్సీల మధ్య టెండర్ల విషయంలో ఆధిపత్య పోరు తమ వేతనాల పంపిణీపై పడినట్లు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా దీపావళి సందర్భంగా జిల్లా ఉన్నతాధికారుల ప్రత్యేక ఫండ్ నుంచి రెండు నెలల వేతనాలు అందించారు. ఇంతలో కొత్త ఏజెన్సీకి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల బాధ్యతలు అప్పగించారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఏకపక్షంగా అవుట్ సోర్సింగ్ బాధ్య తలు అప్పగించారని పాత ఏజెన్సీ వారు కోర్టుకు వెళ్లారు. ఏజెన్సీల నిర్వహణ కోర్టు వివాదంలో ఉండటంతో ఎనిమిది నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. ఉద్యోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు వెంటనే సమస్యను పరిష్కరించి వేతనాలు మంజూరు చేయాలని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు.

వేతనాలు మంజూరు చేయాలి



జిల్లాలోని మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. వేతనాలు అందకపోవడంతో రోజు వారి జీవనం కష్టతరంగా మారింది. ఏజెన్సీల మధ్య నెలకొన్న సమస్యలతో తమ జీవితాలు ఇబ్బందికరంగా మారాయి. ప్రభుత్వ పెద్దలు సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలి.

సామరాజు, ఫిజికల్ డైరెక్టర్ మోడల్ స్కూల్, మఠంపల్లి

కూరగాయల వ్యాపారుల

కష్టాలు తీరేనా!

● ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు

● రూ.80 లక్షలతో మార్పులు, చేర్పులకు ప్రతిపాదనలు



లాంతర్ల వెలుగులో కొనసాగిస్తున్న కూరగాయల వ్యాపారాలు

(ఆంధ్రజ్యోతి-భానుపురి)

సూర్యాపేట జిల్లాలో రహదారిపై కూరగాయల వ్యాపారం నిర్వహించే వ్యాపారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎండనకు, వానకు ఇబ్బంది పడుతూనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించకపోవడంతో మహిళా వ్యాపారుల ఇబ్బందులు అంతా ఇంతా కాదు. రాత్రి వేళ ప్రైవేట్‌లో అద్దెకు తీసుకున్న లాంతర్ల వెలుగులో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఒక్కో లాంతర్‌కు రోజుకు రూ.30 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. వీరి కోసం రూ.కోట్లు ఖర్చు చేసి నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు మార్కెటింగ్ ఇంజనీరింగ్ విభాగం, పంచాయతీరాజ్, మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగాలు పలు దఫాలు పరిశీలన చేశాయి. ప్రస్తుతం ఉన్న స్టాల్స్ సైతం సరిపోవని, వాటిని సైతం విస్తరించాలని అధికారులు సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు విక్రయించే వారు సుమారు 240 మంది ఉన్నట్లుగా వ్యవసాయ మార్కెట్ అధికారులు చెబుతున్నారు. వీరితో పాటు హోల్‌సేల్ వ్యాపారులు సుమారు 25 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇంటిగ్రేటెడ్ భవనంలోకి గాలి, వెలుతురు వచ్చేలా కిటికీలు తీసి వేసి ఐరన్ గ్రిల్స్, తెరచాటు జాలీలు, పైభాగంలో ఉన్న ప్లాస్టిక్ షీట్స్‌ను తీసివేయాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. మార్పుల కోసం రూ.80 లక్షలకు పైచిలుకు ఖర్చు వచ్చే అవకాశం ఉందని బడ్జెట్ కేటాయించాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు విన్నవించారు. బడ్జెట్ మంజూరు కాగానే త్వరలోనే పనులు చేపట్టడానికి మరోమారు ఇంజనీరింగ్ విభాగం అధికారులు పరిశీలన చేయనున్నట్లు వ్యవసాయ మార్కెట్ అధికారులు చెబుతున్నారు. సంక్రాంతి పండుగ వరకు మార్కెట్‌లో కూరగాయల వ్యాపారులు ఒకేచోట నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

బడ్జెట్ కేటాయించాలని మంత్రులకు విన్నవించాం



సూర్యాపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి కొన్ని మార్పులు చేయాల్సి ఉంది. బడ్జెట్ కేటాయించాలని మంత్రులకు విన్నవించాం. రూ.కోట్లు ఖర్చు చేసినా మార్కెట్ నిరుపయోగంగా ఉంది. గాలి, వెలుతురు ప్రసరించేలా పనులు చేయించాల్సి ఉంది. త్వరలోనే పనులను చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తాం.

కొప్పుల వేణారెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

డ్రోన్ విమానం, నిర్వాహకుల పట్టివేత



పాలెంలో స్థానికులు పట్టుకున్న డ్రోన్ విమానం

మఠంపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో నాలుగు రోజులుగా అనుమానాస్పదంగా చక్కర్లు కొడుతున్న డ్రోన్ వినామాన్ని, నిర్వాహకులను గ్రామస్థులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రఘునాథపాలెం గ్రామశివారులో నాలుగు రోజులుగా డ్రోన్ విమానం చక్కర్లు కొడుతోంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఈ డ్రోన్ వినామాన్ని వ్యవసాయ పొలాలు. పాలెం గ్రామం మీదిగా తిప్పుతున్నారు. దీంతో రైతులు, పాలెం ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఏపీ 39ఎస్ఎన్ 0813 వాహనంలో వస్తూ పాలెం పరిధిలోని వ్యవసాయ పొలాల వద్ద వాహనాన్ని నిలిపి సమీపంలోని ఒక వేపచెట్టు వద్ద ముగ్గురు వ్యక్తులు రిమోట్ కంట్రోల్ ద్వారా ఈ డ్రోన్ విమానం నడిపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా డ్రోన్ విమానం తిప్పుతుండటంతో రైతులు, గ్రామస్థులు భయాందోళన చెందారు. రిమోట్ ద్వారా ఆపరేట్ చేస్తున్న ప్రాంతాన్ని, నిర్వాహకులను గుర్తించి వాహనాన్ని, డ్రోన్ విమానాన్ని పట్టుకున్నారు. అయితే తాము డ్రోన్‌ను పరీక్షిస్తున్నా మని, ఎంత సేపు తిరుగుతుం దని తెలుసుకుంటున్నామని, అంతేగని ఏదీ సర్వే చేయడం లేదని చెప్పడంతో వదిలేశారు. ముగ్గురులో ఒకరు మండలానికి చెందిన వ్యక్తి కాగా, మరో ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రానికి చెందిన వారని రఘునాథపాలెం మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

నకిరేకల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నోముల గ్రామంలో తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలయ్యాయి. గ్రామానికి చెం దిన నర్సింగ్ యాదయ్య ఆదివారం సాయ ంత్రం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో మోకుతో పాటు జారి పడటంతో ఆయన తీవ్రగాయాలయ్యాయి. ప్రథ మచికిత్స కోసం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పరిస్థితి విషమించడంతో నల్లగొండ ఆసుపత్రికి తరలించారు. గీత కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలని నోముల గౌడ సంఘం అధ్యక్షుడు గుండగోని జంగయ్యగౌడ్ కోరారు.

వీధి వ్యాపారులకు తీపికబురు!

● స్వనిధి రుణసహాయాన్ని రూ.15వేలకు పెంచిన కేంద్ర ప్రభుత్వం



(ఆంధ్రజ్యోతి-రామగిరి)

వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారికి మరింత ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి పథకం రుణసహాయాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఎనిమిది నెలలుగా ఈ పథకం వెబ్‌సైట్ పనిచేయలేదు. దీంతో వీధి వ్యాపారులంతా ఇక ఆ పథకం రద్దయ్యినట్లేనని భావించారు. తిరిగి ఈ పథకాన్ని 20 రోజుల క్రితం పునఃప్రారంభిస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. 2030 వరకు ప్రస్తుతం ఇచ్చిన మార్గదర్శకాలు కొనసాగుతాయని ఉత్తర్వులో పేర్కొన్నారు. గతంలో రూ.10,000 ఇచ్చిన పథకాన్ని తాజా మార్గదర్శకాల ప్రకారం దానిని రూ.15,000 పెంచుతూ నిర్ణయం తీసుకొంది. 2వ విడత ఇచ్చే రూ.20 వేల రుణ పథకాన్ని రూ.25,000కు పెంచింది. ఈ మేరకు బ్యాంకర్లకు కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. ఒక వీధి వ్యాపారి మొదట రూ.15,000 రుణం తీసుకొని నెల నెలా తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఆ రుణం తీరిన తర్వాత 2వ విడతగా రూ.25,000 ఇస్తారు. ఇది కూడా బ్యాంకుల్లో నెలవారీగా చెల్లించిన తర్వాత మూడవసారి రుణం రూ.50,000 ఇస్తారు. ఇక రూ.50వేలు తీసుకొని రుణాన్ని చెల్లించిన వారి వ్యాపార లావాదేవీలను అనుసరించి రూ.30 నుంచి రూ.50 వేల పరిమితి గల క్రెడిట్ కార్డు కూడా అందజేయనున్నారు. అంతేకాకుండా ఒక నెలలో 200 వరకు ఆన్‌లైన్ ద్వారా వ్యాపార లావాదేవిలు జరిగితే రూ.100 క్యాష్‌బ్యాక్ వచ్చే సౌకర్యం కల్పించింది. ఇదిలా ఉండగా గతంలో 300రకాల వ్యాపారులకే రుణసౌకర్యం అందేలా ఉండగా కొత్తగా వచ్చిన మార్గదర్శకాల ప్రకారం వాటిని 575 రకాల వ్యాపారులకు రుణాలు ఇవ్వనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారు అర్హులేనని అధికారులు గుర్తిస్తే వీరికి మొదటి విడతలోనే రూ.15వేల సహాయం అందనుంది.

మునిసిపాలిటీల వారీగా లక్ష్యం

పీఎం స్వనిధి ద్వారా బ్యాంకర్లతో మాట్లాడి అర్హులైన పేదలకు రుణాలు ఇప్పించాలని కేంద్రం మునిసిపాలిటీల వారీగా లక్ష్యాన్ని విధించింది. దీంతో నల్లగొండ జిల్లాలోని ఎనిమిది మునిసిపాలిటీల్లోని మెప్మా సిబ్బంది దృష్టి సారించారు. 2020లో చిరు వ్యాపారం చేసుకుంటున్న 19,756 గుర్తించారు. ఇందులో 17వేల మందికి మొదటి విడతగా రూ.10వేల చొప్పున, రెండో విడతలో 12,770 మందికి రూ.20వేల చొప్పున, మూడోవ విడతలో 9,476 మందికి రూ.50వేల చొప్పున రుణాలు ఇప్పించారు. ఇక వీరితో పాటు మరో 676 మందిని విధివ్యాపారులకు రుణాలు ఇప్పించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం లక్ష్యం ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మునిసిపల్, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో గత ఆగస్టు నుంచి నేటి వరకు 375 మందిని గుర్తించారు. వీరి దరఖాస్తులను పరిశీలన చేసి బ్యాంకర్లకు పంపించారు. ఇందులో 125 మందికి రుణాలు మంజూరయ్యాయి. మిగిలిన వారికి కూడా త్వరలోనే వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వివిధ కేటగిరీలకు చెందిన రుణాలు కూడా చెల్లించారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు



వీధి వ్యాపారులు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకంలో నామమాత్రపు వడ్డీతో బ్యాంకు నుంచి రుణాలు అందజేయనున్నారు. మునిసిపల్ పరిధిలో వీధి వ్యాపారం చేస్తున్నట్లుగా గుర్తింపు కార్డు కలిగి ఉండి, 18 ఏళ్లకు పైబడి ఉన్నవారు, 2020 నుంచి నేటి వరకు వ్యాపారంలో కొనసాగేవారు అర్హులు. అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

శివాజీనాయక్, నల్లగొండ జిల్లా కో-ఆర్డినేటర్, మెప్మా

మొబైల్‌లోనే దరఖాస్తుకు అవకాశం

ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌లోని గూగుల్ ద్వారా పీఎం స్వనిధి అనే సైట్‌ను ఓపెన్ చేయాల్సి ఉంటుంది. సైట్‌లో (కే.వై.సీ) అడిగే వివరాలను పొందుపరిస్తే ఆ దరఖాస్తు నేరుగా సంబంధిత మునిసిపల్ కమిషనర్ లాగిన్‌కు వెళ్తోంది. దీంతో మునిసిపల్ కార్యాలయం నుంచి సంబంధిత దరఖాస్తుదారుడికి ఫోన్ ద్వారా దరఖాస్తు విషయం తెలియజేయడంతో పాటు అర్హులను గుర్తిస్తారు. అర్హుల జాబితా దరఖాస్తులను బ్యాంకర్‌లకు పంపిస్తారు. దీంతో బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తారు.

నామమాత్రపు వడ్డీకే రుణం

వీధి వ్యాపారం చేసుకొని స్వయం ఉపాధి పొందే చిరు వ్యాపారులకు నామమాత్రపు వడ్డీకే అంటే 12శాతానికి రుణాలు అందజేస్తారు. మొదటి విడతలో తీసుకునే రూ.15వేల సహాయాన్ని 14 నెలలో, ఇక రూ.25వేలు తీసుకునే వారు 18 నెలలో, రూ.50 వేలు తీసుకునేవారు 24 నెలలో కిస్తుల వారీగా చెల్లించాల్సి ఉంటోంది. కిస్తుల చెల్లింపులో తాత్సారం లేకుండా చెల్లించిన వారికి మాత్రమే ఏడు శాతం వడ్డీ రాయితీని సదరు దరఖాస్తుదారుని ఎకౌంట్‌లో జమచేస్తారు. బ్యాంకుల్లో ఎలాంటి డాక్యుమెంటేషన్ పరిశీలన లేకుండా ఇచ్చే రుణం ఎంతో మంది వీధి వ్యాపారులకు ప్రయోజనకరంగా మారనుంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి



నరేష్(ఫైల్)

కేతేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కారు అతివేగంగా ఢీకొట్టడంతో కాలినడకన రోడ్డు దాటుతున్న యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన హైదరాబాద్-విజయవాడ(65) జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలో సోమవారం జరిగింది. ఎస్ఐ సతీష్, గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కొర్లపహాడ్ గ్రామానికి చెందిన అనుముల నరేష్(37) స్థానికంగా మటన్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కాలినడకన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని దాటుతున్నాడు. విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు అతివేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నరేష్‌ను హైవే అంబులెన్స్ సిబ్బంది చికిత్స కోసం నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడికి వెళ్లే సమయానికే నరేష్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నరేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నరేష్‌కు భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని డ్రైవర్

సంస్థాన్ నారాయణపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం సంస్థాన్‌నారాయణపురం మండలం వెంకంబావితండాకు చెందిన కొర్ర హనుమంతు(28) డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి తండా నుంచి మండలకేంద్రానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మిల్లు సమీపంలో ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు హనుమంతు అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమంతుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళ

నకిరేకల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలో ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. సీఐ వెంకటేష్ తెలిపిన వివరాలు ఉన్నాయి. తాటికల్‌కు చెందిన బండమీది వెంకటమ్మ(50)ఆదివారం సాయంత్రం కిరాణం దుకాణం వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో నల్లగొండ నుంచి తాటికల్ మీదుగా వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో అదే రాత్రి మృతి చెందింది. ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకటమ్మ భర్త యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నలు సీఐ వెంకటేష్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

దేవరకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పడ్మట్‌పల్లి సమీపంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి, బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన నేనావత్ దేవి(50) రోడ్డు దాటుతుండగా ఆదివారం రాత్రి జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన గ్రామస్థులు పోలీసులకు, 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వాహనంలో మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దేవి కుమారుడు హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల ఆధారంగా వాహనాన్ని పట్టుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు

చింతలపాలెం / మేళ్లచెర్వు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న ఘటనలో ట్యాంకర్ లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. సిమెంట్ లోడుతో టీఎస్ ఎ29టి5657 నెంబరు గల ట్యాంకర్ లారీ వెళ్తోంది. బ్రిడ్జి సమీపంలో ఇరుకుగా ఉండటంతో ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనక ఉన్న ట్యాంకర్ లారీ అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ అజయ్‌దాస్‌కి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి అదుపులోనే ఉన్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి రైతుకు గాయాలు

ఆత్మకూరు(ఎం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బాట పంచాయితీ విషయంలో పొలం దున్నుతుండగా ట్రాక్టర్‌ను ఆపబోయిన రైతు ఎగిరి పొలంలో పడి గాయాలయ్యాయి. సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో సోమవారం జరిగింది. పుల్లాయిగూడెం గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు జింకల మల్లయ్య ట్రాక్టర్‌తో తన పొలం దున్నుతున్నాడు. అదే గ్రామానికి చెందిన మాలి లింగారెడ్డి పొలం ఎలా దున్నుతావు అంటూ మల్లయ్యను అడ్డుకోబోయాడు. మల్లయ్య పొలం దున్నుతుండగానే లింగారెడ్డి ట్రాక్టర్‌పైకి ఎక్కాడు, ఈ క్రమంలో ట్రాక్టర్ ఎక్స్‌లేటర్ పై కాలు పడింది. దీంతో ట్రాక్టర్ వేగంగా చుట్టూ తిరగ్గా లింగారెడ్డి ఎగిరి బురదపొలంలో పడి గాయపడ్డాడు. గమనించిన చుట్టుప్రక్కల రైతులు అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. జింకల మల్లయ్యకు, మాలి లింగారెడ్డి అతడి సోదరులతో పొలం బాట పంచాయితీ ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

పొలంలో మోటారు చోరీ

నార్కట్‌పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో వ్యవసాయ బావి వద్ద మోటారు చోరీకి గురైంది. చిన్నతుమ్మల గూడెం గ్రామానికి చెందిన వస్కుల శంకర్ తన మూడు ఎకరాల భూమిలో వ్యవసాయం చేయడానికి ఓపెన్ వెల్ వద్ద ఏడు హెచ్‌పీ సామర్థ్యం గల మోటారును బిగించారు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా వైర్లను తెంచి మోటారును దొంగిలించినట్లు గుర్తించాడు. మోటారు చోరీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

బెదిరింపులపై ఫిర్యాదు

నూతనకల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాట్సాప్ కాల్ ద్వారా బెదిరింపులకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తుంగతుర్తి నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మందుల సామేలు అనుచరుడు పాల్వాయి నాగరాజు తెలిపారు. నాగారం మండల కేంద్రానికి చెందిన చిప్పలపల్లి పండు అనే వ్యక్తి వాట్సాప్ ఫోన్ కాల్ చేసి చంపుతానని బెదిరిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మెసేజ్‌ల ద్వారా మానసికంగా వేధిస్తున్నట్లు ఆయన తెలిపారు. అతడి నుంచి తనకు ప్రాణభయం ఉందని, చర్యలు తీసుకోవాలని కోరారు.

టైర్ పేలి ఎక్సైజ్ ఎస్ఐ కారు బోల్తా

● భార్యభర్తలతో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జయిన కారు, గాయపడిన ఎస్ఐ భానుప్రకాష్

కట్టంగూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : టైర్ పేలి కారు బోల్తాకొట్టింది. ఈ ఘటనలో నకిరేకల్ ఎక్సైజ్ ఎస్ఐ దంపతులతో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం నల్లగొండ జిల్లా కట్టంగూరు గ్రామశివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నకిరేకల్ ఎక్సైజ్ ఎస్ఐ భానుప్రకాశ్ తనభార్య ప్రియాంక, కుమార్తెతో కలిసి హైదరాబాద్ నుంచి నకిరేకల్ వైపు కారులో వెళ్తున్నాడు. ఈ క్రమంలో శ్రీకృష్ణనగర్ వద్దకు రాగానే కారు టైరు పేలింది. దీంతో అదుపుతప్పి ముందున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి రోడ్డు ప్రక్కన నీటి గుంతలో బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ఉన్న నకిరేకల్ ఎక్సైజ్ ఎస్ఐ భానుప్రకాశ్ అతని భార్య ప్రియాంకతో పాటు ద్విచక్రవాహనంపై వెళ్తున్న నకిరేకల్ మండలం చందపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు పాలడుగు అంజయ్య, రేణుకలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నల్లగొండ, హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానమై పెనుభూతమై

భార్య హతం



పద్మ(ఫైల్)

మోతె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెను హత్యచేసి పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మోతె ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిరికొండ గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు కారింగుల వెంకన్నగౌడ్‌కు 25ఏళ్ల క్రితం తుమ్మలపెన్‌పహడ్‌కు చెందిన యువతితో వివాహమైంది. ఆమెకు సంతానం కలగనందున ఐదేళ్ల తర్వాత ఆమెకు విడాకులు ఇచ్చాడు. అనంతరం నడిగూడెం మండలం ఎక్లాస్‌కాన్‌పేటకు చెందిన పద్మ(46)ను రెండో వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు మూడేళ్లక్రితం వివాహం చేయగా, కుమారుడు హైదరాబాద్‌లో ఉన్నతవిద్య చదువుతున్నాడు. వెంకన్నగౌడ్, పద్మ దంపతులు కల్లు గీత వృత్తి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లేవారు. సీజన్ ముగియగానే గ్రామానికి వచ్చి తమకున్న నాలుగు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. భార్య ప్రవర్తన సరిగా లేదని వెంకన్నగౌడ్‌కు కొన్నేళ్లుగా అనుమానిస్తుండగా, ఈ విషయమై ఇద్దరూ ఘర్షణ పడుతున్నాడు. ఇదే క్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో రోకలితో భార్య తలపై మోదడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. వెంకన్నగౌడ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పద్మ మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సిరిపురం సమస్యాత్మక గ్రామం అయినందున గ్రామంలో ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మోతె ఎస్ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో 20మంది పోలీసులు సిరిపురం గ్రామంలో గస్తీ కాస్తున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు వెంకన్నగౌడ్‌పై హత్య కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

పుట్టపాకలో ముంబై టెక్స్‌టైల్స్ విద్యార్థుల పర్యటన



పుట్టపాకను సందర్శించిన ముంబాయి సస్మిరా ఇన్స్టిట్యూట్ విద్యార్థులు

సంస్థాన్‌నారాయణపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముంబైలోని సస్మిరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ అండ్ టెక్స్‌టైల్స్ కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు మండలంలోని పుట్టపాక గ్రామంలో సోమవారం పర్యటించింది. డబుల్ ఇక్కత్, తేలియారుమాల్ తయారు విధానాన్ని చేనేత కళాకారులు గోలి సాంబయ్య, గూడ శ్రీనును అడిగి తెలుసుకున్నారు. మగ్గంపై వస్త్ర తయారీ, చేనేత కళాత్మక పనితీరు, రంగుల అద్దకం వంటి పనులను పరిశీలించి, కార్మికుల స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు.

లలిత సిమెంట్స్‌కు రూ.80 వేలు జరిమానా

మఠంపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో అనుమతులు లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న లలితా సిమెంట్ పరిశ్రమకు విజిలెన్స్ అధికారులు జరిమానా విధించారు. సోమవారం విద్యుత్ విజిలెన్స్ డీఈ స్వామినాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లలిత సిమెంట్స్‌లోని గెస్ట్‌హౌస్‌కు సమీపంలోని విద్యుత్ స్తంభం నుంచి అక్రమంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అనుమతులు లేకుండా విద్యుత్ వినియోగించుకుంటున్న లలిత సిమెంట్స్ వారిని హెచ్చరించి రూ.89 వేలు జరిమానా విధించామన్నారు. నిబంధనల ప్రకారం విద్యుత్ ఉపయోగించాలని, చోరీకి పాల్పడితే శాఖపరమైన చర్యలు తప్పవని డీఈ హెచ్చరించారు.

19న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 బాలుర క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని మేఖల అభినవ్ స్టేడియంలో జరుగనున్నాయి. ఈ నెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ దగ్గుపాటి విమల ఒక ప్రకటనలో తెలిపారు. 1 జనవరి 2012 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. బోనోఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డులతో ఉదయం 9గంటలకు స్టేడియానికి హాజరుకావాలని ఆయన ప్రకటనలో తెలిపారు.

నెరవేరని పెండ్లిపాకల



పెండ్లిపాకల రిజర్వాయర్ కట్ట తెగిపోవడంతో వృథాగా వెళ్తున్న నీరు

- ముందుకుసాగని ప్రాజెక్టు ఎత్తు పెంపు పనులు
- ప్రభుత్వం మారినా కన్పించని పురోగతి

నల్లగొండ జిల్లాలో దేవరకొండ నియోజకవర్గం కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపాకల ప్రాజెక్టు ఎత్తుపెంపు పనులు ముందుకు సాగడం లేదు. దశాబ్ద కాలంగా పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. గ్రావిటీ ద్వారా రైతులకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన పనులు మొద ట్లో మందకొడిగా సాగినా తర్వాత ఊసే లేకుండాపోయాయి.

- ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి

కొండమల్లేపల్లి మండలంలోని 0.5టీఎంసీల సామర్థ్యమున్న పెండ్లిపాకల జలాశయాన్ని 2.2 టీఎంసీలకు పెంచాలనే ఉద్దేశంతో 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించి సుమారు రూ.450కోట్లతో టెండర్లు ఆహ్వానించింది. డిండి జలాశయం ద్వారా నీటిని నింపాలనే ఆలోచనతో ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం 2,771ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,917ఎకరాలు మాత్రమే సేకరించారు. ఇంకా 854 ఎకరాలు సేకరించాల్సి ఉంది. హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ రూ.343కోట్లకు టెండర్ దక్కించుకున్నాడు. జలాశయం ఎత్తు పెరిగితే మండలంలో ని కారోబార్ తండా, పత్యతండా, హర్యతండా, గుడితండా పూర్తిగా ముంపునకు గురవుతాయి. ప్రాజెక్టు ఎత్తుపెంపుతో సుమారు 1,300 నుంచి 1,400 కుటుంబాలు భూ నిర్వాసితులవుతాయి. ముంపు గ్రామమైన గుడితండాలో ప్రజలతో ఎస్‌డీసీ(స్పెషల్ డిప్యూటి కలెక్టర్ భూ సేకర ణ) ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయాలు సేకరించారు. సామర్థ్యం పెరిగితే పెండ్లిపాకల గ్రామపంచాయతీ పరిధిలో సుమారు నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. పేర్వాల వద్ద కాల్వ నిర్మిస్తే నేరేడుగొమ్ము మండలంలో సుమారు తొమ్మిది వేల ఎకరాలు సాగులోకి వస్తుందని అధికారులు లెక్కలు వేశారు. 2018లోనే పూర్తి కావాల్సిన పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అలాగే ఉన్నాయి. కేవలం 31శాతం పనులు మాత్రమే చేపట్టి పనులు నిలిపివేశారు. మిగిలిన పనులు పూర్తిచేయాలంటే ప్రస్తుతం రేట్లతో సుమారు రూ.600కోట్ల నుంచి రూ.650 కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు తెలుపుతున్నారు.

నాయకులు హామీలు నీటి మూటలే

పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు పూర్తిచేస్తామని గత ప్రభుత్వం చేసిన ప్రకటనలు హామీలకే పరిమితమయ్యాయని పలువురు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు ఎత్తుపెంచి పూర్తి చేస్తామని గత ఎన్నికల సమయంలో కొండమల్లేపల్లిలో నిర్వహించిన సభలో అప్పటి ఓ మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వం మారి రెండు సంవత్సరాలు కావొస్తున్నా అధికార పార్టీ నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం పనులు ప్రారంభం కాలేదు.

పదేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు



పెండ్లిపాకల జలాశయం ఎత్తు పెంపునకు పదేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. ఇప్పటికి సగం పనులు కూడా పూర్తి కాలేదు. రిజర్వాయర్ ఎత్తు పెంపుతో మూడు కాలాలకు సరిపడ పంటలు పండుతాయని ఆశ పడ్డాం. పనులు పూర్తి కాకపోవడంతో ఆశలు ఆవిరయ్యాయి. ప్రభుత్వం త్వరగా జలాశయం ఎత్తు పనులు పూర్తిచేయాలి.

- నక్క సైదులు పెండ్లిపాకల

కాంట్రాక్టర్‌తోనే పనుల్లో ఆలస్యం

టెండర్ దక్కించుకున్న గుత్తేదారు సకాలంలో పనులు పూర్తి చేయకుండా జాప్యం చేశారు. దీంతో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇప్పటికే పలుమార్లు కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశాం. ఎలాంటి స్పందన రాలేదు. కాంట్రాక్టర్‌కు ఇచ్చిన టెండర్ రద్దు చేసి మిగిలిన పనులు పూర్తి చేసేందుకు ప్రస్తుత ధరల ప్రకారం అడ్మినిస్ట్రేట్ నుంచి అనుమతి తీసుకొని ప్రతిపాదనలు పంపి త్వరలోనే కొత్త టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకుంటాం.

- కేతావత్ నెహ్రూ, జలాశయం ఈఈ.

మాకు ఆవాసం కల్పించండి

● 12 సంవత్సరాలు గడుస్తున్నా భరోసా లేని బతుకులు



చర్లగూడ రిజర్వాయర్ కట్ట

మర్రిగూడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'మాకు అవాసం కల్పించండి.. 12 సంవత్సరాలుగా భరోసా లేకుండా బతుకుతున్నాం.' అని చర్లగూడెం రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండజిల్లా మర్రిగూడ మండలం చర్లగూడెం రిజర్వాయర్ కోసం 3,500 ఎకరాల్లో 12టీఎంసీల సామర్థ్యంతో అప్పటి సీఎం కేసీఆర్ 2015లో శివన్నగూడ పైలాన్ వద్ద శంకుస్థాపన చేశారు. రిజర్వాయర్‌లో నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం, వెంకపల్లి, వెంకపల్లితండా గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. 2018లో రూ4.50 వేలు, 2020లో రూ.5.40లక్షల చొప్పున రెండు దఫాలుగా నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించారు. నాలుగు ముంపు గ్రామాల్లో డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా 1200 కుటుంబాలను పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం అర్హులుగా గుర్తించారు. పూర్తిస్థాయిలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించలేదని, ఇప్పటివరకు పునరావాసం కల్పించలేదని నిర్వాసితులు వాపోతున్నారు. పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని రిజర్వాయర్ పనులు పూర్తి చేసుకుంటున్నారు తప్ప, తమ గోడు పట్టించుకోవడం లే దని ఆరోపిస్తున్నారు.తల దాచుకోవడానికి నీడ లేకుండా పోయిందని కంటతడి పెడుతున్నారు.

ఇప్పటి వరకు అందని ధ్రువీకరణ పత్రాలు

పునరావాసం కల్పిస్తామని చింతపల్లి మండలంలో సాయిబాబా టెంపుల్ సమీపంలో నర్సిరెడ్డిగూడెం నిర్వాసితులు 182 మంది లబ్ధిదారులగాను కేవలం 150 మందికి డ్రా పద్ధతిలో ఇళ్ల నెంబర్లు వేశారు. కాని ఇప్పటి వరకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేదు. అదేవిధంగా చర్లగూడెం నిర్వాసితులకు పునరావాసం కోసం వర్కాల గ్రామ సమీపంలో ప్లాట్ల స్థలాలు ఇస్తామంటూ తీసుకెళ్లి ప్రభుత్వ స్థలాన్ని ఇంటి స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. కానీ అధికారులు ఇప్పటివరకు అందించలేదు.



సాగుని నమ్ముకుని జీవిస్తున్నాం..

సాగును నమ్ముకున్న తాము ఒక్కసారిగా సర్వం కోల్పోవడంతో గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని బాధితులు వాపోతున్నారు. అధికారులు బలవంతంగా గ్రామాలు ఖాళీ చేయాలని ఇబ్బందులు గురి చేస్తున్నారని కన్నీరు పెడుతున్నారు. చర్లగూడెం రిజర్వాయర్ ముంపునకు గురవుతున్నా పూర్తిస్థా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించే విషయంలో భరోసా లేదని చెబుతున్నారు. ఆర్అండ్ఆర్, ప్యాకేజీ పునరావాసం కల్పించాలని నాలుగు ముంపు గ్రామాల బాధితులు కలిసి రిజర్వాయర్ పనులు అడ్డుకుంటే ఆ మండలంలో.. ఈ మండలంలో పునరావసం కల్పిస్తామంటూ, అర్హులైన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కూడా చెల్లిస్తామంటూ మాయ మాటలు చెప్పి కాలం వెళ్లదీస్తున్నారని వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

మాకు పునరావాసం కల్పించాలి



సర్వం కోల్పోయాం. ఇప్పటివరకు పునరావాసం లేదు. అర్హులైన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించలేదు. అధికారులు పునరావాసం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించకుండా రిజర్వాయర్ నిర్మాణం పనులు పూర్తి చేసుకుంటున్నారు. నష్టపరిహారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించామంటూ గ్రామాలను ఖాళీ చేయాలని బలవంతం చేస్తున్నారు. 12 సంవత్సరాలు గడుస్తున్నా బాధితులను ఆదుకోవడం లేదు. మేము ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి. పునరావాసం కల్పించి ఆదుకోవాలి.

- కేశవులు, ముంపు బాధితుడు, చర్లగూడెం

ఆస్పత్రి నుంచి విద్యార్థులు డిశ్చార్జి

● ఇంజక్షన్ వికటించి అస్వస్థతకు గురై చికిత్సపొందిన చిన్నారులు

నాగార్జునసాగర్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంజక్షన్ వికటించి అస్వస్థతకు గురైన విద్యార్థులు సోమవారం డిశ్చార్జి అయ్యారు. వైరల్ ఫీవర్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు ఇచ్చిన యాంటీ బయాటిక్ ఇంజక్షనే ఇందుకు కారణమని భావిస్తున్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీ, పైలాన్ కాలనీలతోపాటు సాగర్ పరిసర గ్రామాలకు చెందిన చిన్నారులు విషజ్వరాలతో మూడు రోజుల క్రితం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో చేరారు. ఇంజక్షన్ వికటించడంతో 17మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించడంతో అందరూ కోలుకున్నారు. ఆదివారం 10 మందిని, సోమవారం మరో ఏడుగురిని డిశ్చార్జి చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భానుప్రసాద్‌నాయక్ తెలిపారు. తమ సిబ్బంది రెండు రోజులు శ్రమించి చిన్నారులకు మెరుగైన వైద్యం అదించారని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎల్కా పూజ

నూతనకల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎల్క పూజ అండర్-14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా మర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి అండర్-14 ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాములునాయక్ తెలిపారు. పూజను హెచ్‌ఎం, ఫిజికల్ డైరెక్టర్ చెరుకు నాగేందర్ ఉపాధ్యాయులు అభినందించారు.

గేయాలతో అవగాహన అభినందనీయం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాలమ్మ తదితరులు

నల్లగొండ కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బాల గేయాలతో విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయమని నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ బాలమ్మ, రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లాకేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రచించిన 'ఊగుతున్న ఊయ్యాల' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గాయకుడు అంబటి వెంకన్న, గ్రంథాలయ మాజీ చైర్మన్ వినోద్‌రెడ్డి, పున్న అంజయ్య, ఎలికట్టి శంకర్‌రావు, వేణుగోపాల్‌చార్యులు, రాజేశం, శ్రీను, మల్లేశం, అరుణ, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి తాళం

● అద్దె చెల్లించలేదని భవన యజమాని ఆగ్రహం

అడ్డగూడూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అద్దె చెల్లించడం లేదని ఆరోపిస్తూ భవన యజమాని యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు తహసీల్దార్ కార్యాలయానికి సోమవారం తాళం వేశాడు. నూతనంగా ఏర్పడిన అడ్డగూడూరు మండలకేంద్రంలో సొంత భవనం లేకపోవడంతో ప్రభుత్వం అద్దె భవనానికి నెలకు రూ.12,600లకు అద్దె చెల్లిస్తోంది. సోమవారం కార్యాలయం(భవనం) ఇంటి రెండున్నర సంవత్సరాలుగా అద్దె చెల్లించడం లేదని, సూమారుగా రూ.2.13లక్షలు రావల్సి ఉందని అద్దె యజమాని తెలిపాడు. సోమవారం ఉదయం 10 గంటలకు కార్యాలయం తాళం వేసినట్లు తెలిపారు. విషయమై తహసీల్దార్ శేషగిరిరావు మాట్లాడుతూ, కార్యాలయం భవన బకాయిలు బకాయి బిల్లు చెల్లించాల్సి ఉంది వాస్తవమేనని, బకాయి బిల్లు గురించి కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు. ఇంటి యాజమానికి నచ్చజెప్పి ఉదయం 10గంటలకు కార్యాలయానికి వేసిన తాళాన్ని తీయించినట్లు తెలిపారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేస్తున్న భవన యజమాని

గుట్టలో శివకేశవులకు విశేష పూజలు



యాదగిరిగుట్ట ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి వైష్ణవ పాంచరాత్రాగమ రీతిలో, పర్వతవర్థిని రామలింగేశ్వర స్వామి శివాలయంలో స్పటిక మూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. శివాల యం ముఖమండపంలో స్పటిక మూర్తులను వేదమంత్ర పఠనాలు, మంగళవాయి ద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. సుమారు 35వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనానికి అరగంట, ధర్మదర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఉచిత దర్శన క్యూకాంప్లెక్స్, ఉభ య క్యూలైన్లల్లో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి కొనసాగింది. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.36,04,621 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. కొండకింద వ్రత మండపాల్లో 1,324 జంటలు పాల్గొన్నా యి. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ ప్రొవిజన్స్, స్పోర్ట్స్, క్రీడలు ఐజీ రమేష్ స్వామివారిని దర్శించుకున్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి : ఈవో

అన్ని విభాగాల సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఈవో ఎస్. వెంకట్రావు సూచించారు. సోమవారం ఆయన పలు విభాగాలను పరిశీలించారు. గోశాల రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. వ్రత మండపం వద్ద దుకాణాల్లో వస్తువులను నిర్ణీత ధరలకే విక్రయించడంతో పాటు టెండరు ఒప్పందం ప్రకారం ప్రతి దుకాణంలో ధర పట్టిక ఉండాలన్నారు. సత్యదేవుడి వ్రతాలు జరిపించే భక్తులతో మాట్లాడి వ్రతాలు నిర్వహించే సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పులిహోర ప్రసాద వితరణలో పరిశుభ్రత, నాణ్యత, పరిణామం మరింత మెరుగుపర్చాలన్నారు. కార్యక్రమంలో ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు గజ్వేల్లి రఘు, జాటోత్ శంకర్‌నాయక్, నాగుల మహేష్‌గౌడ్, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు తదితరులు ఉన్నారు.

చెర్వుగట్టుపై భక్తుల రద్దీ



కార్తీక పూజల్లో పాల్గొన్న భక్తులు

నార్కట్‌పల్లి: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. పుష్కరిణిలో స్నానం ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. ప్రధానాలయంలో మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. గుట్టపై ఉన్న ఉపాలయాలను సందర్శించారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. కాగా ఆలయ పరిసరాలు పరిశుభ్రగంగా ఉంచాలని శివసత్తులకు, భక్తులకు ఈవో మోహన్‌బాబు అవగాహన కల్పించారు. మండలంలోని మాండ్ర-కక్కిరేణి గ్రామాల శివారులో ఉన్న స్వర్ణగిరి పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయంలో సామూహిక సత్యదేవుని వ్రతాలు భక్తి శ్రద్ధలతో ఆచరించారు.

రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రభుత్వం

● కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనరసయ్య



మాట్లాడుతున్న కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనరసయ్య

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 17,(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీనరసయ్య ఆరోపించారు. పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం 24గంటల నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వరంగల్‌లో చేసిన డిక్లరేషన్ ప్రకారం రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసగించిందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో పూర్తిగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవడంలేదన్నారు. ప్రభుత్వ వ్యవహార శైలితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం సకాలంలో స్పందించి ఉంటే రైతులకు ఇబ్బందులు తప్పేవని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అవినీతి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతుల ఇబ్బందులను తప్పించడానికి కేంద్రం ప్రభుత్వం రబీ సీజన్‌కు సంబంధించి రూ.39వేల కోట్ల విలువైన ఎరువులను సబ్సిడీ రూపంలో అందజేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతులను గాలికి వదిలేసిందని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని డబ్బులను కేంద్రమే పంపిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా కొనుగోలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కలిగించాలనే ఉద్దేశంతోనే బీజేపీ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టామని తెలిపారు. సన్న ధాన్యానికి ప్రకటించిన బోనస్ వెంటనే ఇవ్వాలని, ఫసల్ బీమా యోజన పథకాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, పోతేపాక లింగస్వామి, పకీర్ మోహన్‌రెడ్డి, మిర్యాల వెంకటేశం, పిన్నింటి నరేందర్‌రెడ్డి, శాంతి స్వరూప్, పోకల దశరథ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో జర్నలిస్ట్ నాగేశ్వరరావుకు అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగేశ్వరరావు

మిర్యాలగూడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ ఫొటో జర్నలిస్ట్ పుట్టా నాగేశ్వరరావుకు నేషనల్ జర్నలిస్ట్ వెల్ఫేర్ బోర్డు(ఒడిస్సా) జాతీయ పురస్కారం లభించింది. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఒడిషాలో జరిగిన కార్యక్రమంలో జాతీయ స్థాయిలో వివిధ విభాగాలకు చెందిన 35మంది సీనియర్ జర్నలిస్ట్‌లకు అవార్డులు అందజే శారు. తెలం గాణ రాష్ట్రం నుంచి ప్రెస్ ఫొటోగ్రాఫర్ నాగేశ్వరరావు అవార్డు అందుకున్నారు. జాతీయ పురస్కారం అందుకున్న నాగేశ్వరరావును ప్రజాప్రతినిధులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు అభినందించారు.

సీసీఆర్టీ రిఫ్రెషర్ కోర్సులో శిక్షణ



విద్దాని శీతల్

గుర్రంపోడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలకేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు విద్దాని శీతల్ న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్(సీసీఆర్టీ)లో రిఫ్రెషర్ కోర్సు పూర్తిచేశారు. ఇటీవల ఆమె సీసీఆర్టీలో రిఫ్రెషర్ కోర్సుకు ఎంపికయ్యారు. ఈ నెల 10వ తేదీ నుంచి 14వరకు న్యూఢిల్లీలో శిక్షణ పొందారు. దేశంలోని సుమారు 13రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులు ఈ కోర్సులో శిక్షణ పొందినట్లు శీతల్ తెలిపారు. శిక్షణలో భాగంగా గొరియా, చౌనుత్యాలు, వార్లేఆర్ట్, రంగోళి, బీడ్ క్రాస్ వంటి సంప్రదాయ హస్త కళలకు సంబంధించిన అంశాలపై నిపుణులు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మక, వినూత్న పద్ధతుల్లో భారతీయ సం స్కృతి వైవిధ్యం పట్ల విద్యార్థులకు ఎలా శిక్షణ ఇవ్వాలో అవగాహన కల్పించారని తెలిపారు. శీతల్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ రాగిణి, ఉపాధ్యాయులు అభినందించారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం తంతు నిర్వహిస్తున్న పండితులు

వలిగొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని సుంకిశాల గ్రామంలో కొలుదీరిన వేంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవం సోమవారం శాస్త్రోక్తంగా జరిగింది. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, మాంగళ్యమును పైళ్ల సోదరులు అందజేశారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు వేంకటేశ్వరస్వామి కల్యాణం పద్మావతి, అలివేలు మంగ సమేత అమ్మవార్లతో ప్రత్యేక మండపంలో వేద మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు, సన్నాయి, రాగాల నడుమ అంగరంగ వైభవంగా సాగింది. ముక్కోటి దేవతలు ఆహుతులుగా సృష్టికర్త బ్రహ్మదేవుడి సమక్షంలో వేంకటేశ్వరుడు లోక కల్యాణార్థం, సకల దేవతల నెలవైన లక్ష్మీఅమ్మవార్ల మెడలో సోమవారం శుభముహర్తం, శుభ గడియాల్లో మాంగళ్యధారణ గావించారు. కల్యాణ మహోత్సవ వేడుకలను యజ్ఞాచార్యులు, అరుణ్‌కుమార్‌చార్యులు, దేవస్థానం ప్రధానార్చకులు సంతోష్‌కుమారాచార్యులు, యాదగిరిగుట్ట దేవస్థానం విశ్రాంత ప్రధానఅర్చకులు కారంపొడి నర్సింహచార్యులు, ఆధ్వర్యంలో జరిగింది. కల్యాణోత్సవంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, పైళ్ల సోదరులు పైళ్ల అచ్చిరెడ్డి, రాజిరెడ్డి, మార్కెట్ చైర్మన్ బీమానాయక్, మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజు, నాయకులు పాశం సత్తిరెడ్డి, తుమ్మల శ్రీనివాస్, తుమ్మల యుగేందర్‌రెడ్డి, కుంభం వెంకటపాపిరెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, బద్దం సంజీవరెడ్డి, పలుసం సతీష్‌గౌడ్, గూడూరి అశోక్‌రెడ్డి, చిలుగూరి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

పైళ్ల మల్లారెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే

వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ దాత డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి-సాధన ఆధ్యాత్మిక, సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దైవదర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. వేంకటేశ్వరస్వామి దేవాయంలో కొలువుదీరిన ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళా భక్తులు అమ్మవారికి ప్రత్యేకంగా నైవేద్యాన్ని తయారు చేసి శివసత్తుల పూనకాలతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని భోనం సమర్పించారు. మండలంలోని సంగెం గ్రామ సమీపంలో శ్రీగంగా, గౌరీ సమేత భీమలింగేశ్వరస్వామి సమీపంలో స్వామివారి కల్యాణం నేత్రనందంగా జరిగింది. శివలింగానికి పంచామృతాలతో అభిషేకం జరిపి అర్చకులు వేదమంత్రాలతో పారాయణాలు చేశారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హన్మంతరావు, ఆర్డీవో శేఖర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ బీమానాయక్, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు, తహసీల్దార్ దశరథ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపాధ్యాయుడి చేయూత



విద్యార్థులకు పరీక్షల ఫీజు చెల్లించిన అంజయ్యను అభినందిస్తున్న ఎంఈవో సైదానాయక్

హుజూర్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరక్కాయల గూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు చేయూతనందించారు. 10వ తరగతి చదువుతున్న 14 మంది విద్యార్థులకు ఉపాధ్యాయుడు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలూరి అంజయ్య పరీక్ష ఫీజులను చెల్లించారు. ఈ నగదును ఎంఈవో సైదానాయక్‌కు సోమవారం పాఠశాలలో అంజయ్య అందజేశారు. ఈ సందర్భంగా అంజయ్యను ఎంఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామిశెట్టి శ్రీనివాసరావు, బొల్లం వెంకటేశ్వర్లు, అత్తి వెంకటేశ్వర్లు, నర్సింహారావు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

అదనపు డివైడర్లను తొలగించాలి

హుజూర్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అదనంగా ఉన్న డివైడర్లను తొలగించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సామాజిక కార్యకర్త పాలకూరి బాబు కోరారు. పట్టణంలోని పలు సమస్యలపై కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌కు సోమవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇందిర సెంటరులోని డివైడర్‌తో ఇప్పటికే చాలా ప్రమాదాలు జరిగాయని, ఈ డివైడర్‌లోని కొంత భాగాన్ని తొలగించాలన్నారు. ఇందిర సెంటరులో జంక్షన్ ఏర్పాటుచేసి సిగ్నల్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవిశెట్టి రామ్మూర్తి, సోమగాని రామన్న తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా కవిత



హుజూర్‌నగర్, గరిడేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా బండ కవిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గరిడేపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆమెను హుజూర్‌నగర్‌కు బదిలీ చేశారు. ఇక్కడ తహసిల్దార్‌గా పనిచేసిన నాగార్జునరెడ్డి గ్రూప్-1 ఆఫీసర్‌గా ఎంపికై ఎస్డీవోగా వెళ్లారు. ఆయన స్థానంలో ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న చల్లా శ్రీనివాస్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వారం రోజుల క్రితం నియమించారు. శ్రీనివాస్ స్థానంలో కవిత బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆమెను తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు షరీఫ్, గాలి శ్రీనివాసు, మేకపోతుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● గరిడేపల్లి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ స్రవంతికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నియామకాలపై చర్యలు తీసుకోవాలి

మఠంపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, కళాశాల, హాస్టల్స్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డీటీడీవో సిబ్బంది, రోజువారి కార్మికులను నియమిస్తున్నారని గుర్రంబోడుతండాకు చెందిన మురహరి తెలిపారు. ఈ మేరకు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురైదుగురిని డైలీ వేజ్‌గా నియమించారన్నారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని అర్హులకు న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరాడు.

గ్రీవెన్స్‌డేను సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ డేలో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావు కోరారు. గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాములునాయక్, ఎంపీవో శశికళ, ఏపీఎం వెంకట్‌రెడ్డి, ఏపీవో శ్రీరాములు, ఏఈ కల్యాణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నృసింహుని కల్యాణం

మఠంపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి క్షేత్రంలో నృసింహుని నిత్య కల్యాణాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం 11గంటలకు రాజ్యలక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సరికొండ నవీన్ ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గేదెలను యజమానులు తీసుకువెళ్లాలి

అనంతగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీనాబాద్ గ్రామంలో బందుల దొడ్డిలో ఉన్న గేదెలను యజమానులు తీసుకువెళ్లాలని గ్రామ కార్యదర్శి నరేష్ కోరారు. గ్రామంలోని ఓ రైతు పొలంలో రెండు గేదెలు, ఒక దూడ పలుమార్లు వరిని నాశనం చేసిన నేపథ్యంలో ఆ రైతు గేదెలను తన ఇంటి వద్ద కట్టేసినా యజమానులు ఎవరూ రానందున గ్రామం పంచాయతీకి అప్పగించారన్నారు. గేదెల సంరక్షణ పంచాయతీకి భారంగా ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, ఈ గేదెలను ఈ నెల 31న వేలం వేయాలని నిర్ణయించారన్నారు. ఈ నెలాఖరు లోపు గేదెల యజమానులు సరైన ఆధారాలతో వచ్చి, ఇటీవల వాటి సంరక్షణకు వెచ్చించిన ఖర్చులు చెల్లిస్తే గేదెలను ఇస్తామన్నారు.

భూఆక్రమణపై ఎనిమిది మందిపై కేసు

పెన్‌పహాడ్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగారకుంటతండాకు చెందిన దరావత్ లక్యా, సోమిలి దంపతులకు గ్రామంలో 1.20ఎకరాల భూమి ఉంది. ఈ దంపతులు ఎక్స్‌కవేటర్‌తో భూమిని చదును చేయిస్తుండగా, చిన్నగారకుంట తండాకు చెందిన దరావత్ శంకర్, బాలాజీ, గోజియా, భగ్యా, కౌసల్య, ఆదిలక్ష్మి తదితరులు అడ్డుకున్నారు. బాధితులు డయల్ 100కు కాల్ చేయడంతో నిందితులు పరారయ్యారు. ఈ ఘటనపై లక్యా, సోమిలి దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీకృష్ణ తెలిపారు.

బొగ్గు బట్టీ.. విద్యార్థులకు సుస్తీ



సొల్లతండ గ్రామ ప్రాథమిక పాఠశాల పక్కనే బట్టీకి పేర్చిన కట్టెలు

తిరుమలగిరి మండలంలోని సొల్లతండ ప్రాథమిక పాఠశాల పక్కనే బొగ్గు బట్టీలు ఏర్పాటు చేశారు. ఈ బట్టీల నుంచి వచ్చే పొగను పీల్చిన విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ బట్టీలను కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నా, అధికారులు పట్టించుకోవడంలేదని, పాఠశాల వాతావరణం దెబ్బతింటోందని, వీటిని గ్రామానికి దూరంగా తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● తిరుమలగిరి రూరల్

రహదారి ఇలా.. వెళ్లేది ఎలా?

రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

మఠంపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో మారుమూల గ్రామాలకు వెళ్లాలంటే రహదారులు అధ్వానంగా మారాయి. చినుకు పడితే రహదారులు బురదమయంగా మారి రాకపోకలకు ఆటంకంగా మారుతున్నాయి. 20ఏళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్లు గుంతలమయంగా మారాయి. మఠంపల్లి మండలంలో ఏ గ్రామానికి వెళ్లాలన్నా ఈ అధ్వాన రహదారుల్లో సాఫీగా వెళ్లలేని పరిస్థితి ఉంది.

మఠంపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి గ్రామ పంచాయతీ వరకు డబుల్ రోడ్డు ఆక్రమణ గురై గుంతలతో నిండి ఉంది. అదేవిధంగా మండలంలోని గుర్రంబోడుతండా స్టేజీ నుంచి కృష్ణతండా, భోజ్యతండా, భీమ్లాతండా, రామచంద్రాపురం మీదుగా ఎన్‌సీఎల్ పరిశ్రమ వరకు వెళ్లే రోడ్డులో అడుగడుగునా గుంతలు ఉన్నాయి. చాలా చోట్ల రోడ్డు దెబ్బతిని భారీ గుంతలు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షానికే గుంతలో నీరుచేరి ప్రమాదకరంగా మారడంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారి మఠంపల్లి, గరిడేపల్లి, పాలకవీడు, నేరుడుచర్ల, జాన్‌పహాడ్, దామరచర్ల మండలాలతో పాటు 11 గ్రామాలను కలుపుతోంది. అదేవిధంగా ఎన్‌సీఎల్ పరిశ్రమకు, ప్రసిద్ధ మట్టపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్షేత్రానికి, లాలితండా, తుమ్మలతండా, వర్ధాపురం, మంచ్యాతండా, మీగడంపాటుతండాలకు వెళ్లాలంటే ఈ రహదారి నుంచే రాకపోకలు సాగించాలి. రహదారి అధ్వానంగా మారినందున ప్రజలు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని ప్రయాణిసున్నారు. ఇటీవల తుపాను ప్రభావంతో వర్షాలు వరసగా కురవడంతో అంతంత మాత్రంగా ఉన్న మండలంలోని రహదారులు పూర్తిగా అధ్వానంగా మారాయని, ప్రభుత్వం స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న కృష్ణతండా నుంచి భోజ్యతండాకు వెళ్లే రహదారి

రహదారికి మరమ్మతులు చేపట్టాలి



గుర్రంబోతండా నుంచి ఎన్‌సీఎల్ పరిశ్రమ వరకు ఆధ్వానంగా మారిన రహదారికి ప్రభుత్వం మరమ్మతులు చేయించాలి. 7.5కిలో మీటర్లు ఉన్న ఈ రహదారిలో గమ్యం చేరేందుకు అర గంట పడుతోంది. చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తోంది. మూడు మండలాలు ఏడు గ్రామాలను కలిపే ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. దూరం తక్కువైనందున ఎన్‌సీఎల్ పరిశ్రమకు, మట్టపల్లి ఆలయానికి ఈ రహదారిలో కార్మికులు, ప్రజలు, భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. పాలకులు స్పందించి రహదారికి మరమ్మతు చేయించాలి.

● భూక్య పాండునాయక్, భీమ్లాతండా

ప్రతిపాదనలు పంపాం

గుర్రంబోడుతండా స్టేజీ నుంచి వయా కృష్ణతండా, గుర్రంబోడుతండా, భీమ్లాతండా, భోజ్యతండా, రామచంద్రా పురం తండా నుంచి ఎన్‌సీఎల్ పరిశ్రమ వరకు 7.5 కిలో మీటర్లు దూరం ఉన్న రహదారి మరమ్మతులకు రూ.2కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి సమస్యను పరిష్కరిస్తాం.

● పంచాయతీరాజ్ ఏఈ

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మఠంపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున మండలంలోని రఘునాథపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని పాలెం, గుండ్లపల్లి, వెంకటాయపాలెం గ్రామాల్లో విద్యుత్‌ను నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రామాలయంలో పవళింపుసేవ

హుజూర్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవేణుగోపాల-శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో సోమవారం స్వామివారికి పవళింపు సేవను నిర్వహించారు. ముందుగా రైతు మహిళా సంఘం ఆధ్వర్యంలో లక్ష తులసి పూజ నిర్వహించారు. అనంతరం అద్దాల మండపంలో పవళింపు సేవ నిర్వహించారు. అన్నమయ్య భజనమండలి, స్థానాచార్యుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తిగీతాలు ఆలాపనల మధ్య శ్రీవేణుగోపాల-శ్రీసీతామచంద్ర స్వామి దేవతామూర్తుల పవళింపుసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో గుజ్జుల కొండారెడ్డి, ముడుంబై శ్రీనివాసాచార్యులు, రంగభట్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డ శివాలయంలో శాంతి కల్యాణం



బూరుగడ్డలో శాంతి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

హుజూర్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా సోమవారం మండలంలోని బూరుగడ్డ గ్రామంలో శ్రీనల్లకట్ట సంతాన కామేశ్వరి సమేత శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి శాంతి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిమ్మట సైదులు, రవీంద్రాచార్యులు, గూడెపు సీతమ్మ, శ్రీనివాసు, సాముల శివారెడ్డి, లక్ష్మీపార్వతి, షేక్ ఆలీపాషా, సైదులు, సత్యనారాయణ, సతీష్, విజయలక్ష్మి, చందర్‌రావు, వసంత, అంజయ్య, సైదమ్మ, వెంకటరమణ, ఉమామల్లిక, సురగాని రాములు, మట్టపల్లి పాల్గొన్నారు.

● నూతనకల్, నేరేడుచర్ల: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా నూతనకల్, నేరేడుచర్ల మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లోని దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు శివయ్యకు రకరకాల అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు.

చదువుతో పాటు సంస్కారాన్ని నేర్చుకోవాలి

ప్రజా కళాకారుడు బాదె లింగయ్య

గరిడేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సంస్కారాన్ని నేర్చుకోవాలని ప్రజా కళాకారుడు బాదె నర్సయ్య అన్నారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై సోమవారం మండలంలోని పొనుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారిస్తేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నరసకుమారి, ఉపాధ్యాయులు కట్ట శ్రీనివాస్, ప్రభాకర్, మణికుమారి, జ్యోతి, రాంప్రసాద్, నరేష్, అరుణ, నగేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



పొనుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రజా కళాకారుడు బాదె నర్సయ్య

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మేళ్లచెర్వు మండలం రామాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

చింతలపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొను గోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దొండపాడు పీఏసీఎస్ చైర్మన్ కలగొట్ల కోటిరెడ్డి అన్నారు. సోమవారం మేళ్లచెర్వు మండలం రామాపురం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మేళ్లచెర్వు మాజీ ఎంపీపీ కొట్టె పద్మ సైదేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ చింతలపాలెం మండల అధ్యక్షుడు నరాల కొండరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేళ్లచెర్వు మండల నాయకులు రంగిశెట్టి సైదయ్య, వెంకయ్య, రావూరి సుబ్బయ్య, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

● మద్దిరాల: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు తొట్ల ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సోమవారం మద్దిరాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటయ్య, సోమయ్య, శ్రీనివాస్, లింగయ్య, మల్సూర్ పాల్గొన్నారు.

ఘనంగా ఏబీఏడీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

సూర్యాపేట అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అయ్యప్ప దేవాలయ ఆవరణలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ(ఏబీఏడీపీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రంగు ముత్యంరాజు మాట్లాడుతూ ఏబీఏడీపీఎస్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకాని శ్రీనివాస్, సిద్దప్ప, లింగారెడ్డి, మధు, నగేష్, లక్ష్మణ్, రమేష్, జీవన్, మధుకర్‌రెడ్డి, నరేందర్, విక్రమ్, కృష్ణ, రాంబాబు, సందీప్, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

వైభవంగా ఇరుముడుల కార్యక్రమం

మఠంపల్లి: మండలంలోని జమ్లాతండా, దొనబండతండాలలో అయ్యప్ప మాలధారుల ఇరుముడుల కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారులను టీపీసీసీ అధికార ప్రతినిధి బానోతు భాస్కర్‌నాయక్ సన్మానించారు.



సూర్యాపేటలో ఏబీఏడీపీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న అయ్యప్ప మాలధారులు

గణిత ఒలంపియాడ్‌లో 'జయ' విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేట అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రామానుజన్ గణిత అకాడమి నిర్వహించిన గణిత ఒలంపియాడ్ ఫలితాల్లో జయ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ఆపాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు.. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ పాఠశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 69మంది రెండో లెవల్‌కు అర్హత సాధించారని తెలిపారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారని ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ తదితరులు పాల్గొన్నారు.



గణిత ఒలంపియాడ్‌లో ప్రతిభ చాటిన జయ పాఠశాల విద్యార్థినీవిద్యార్థులు

వృద్ధుల సంరక్షణ కుటుంబ సభ్యుల బాధ్యత

సూర్యాపేట లీగల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వృద్ధుల సంరక్షణ కుటుంబ సభ్యుల బాధ్యతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పర్వీన్ కౌసర్ అన్నారు. సోమవారం సూర్యాపేటలో స్నేహ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని నిర్వాహకులను హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్‌సీ నామినేటెడ్ మెంబర్ గుంటూరు మధు, సుంకర బోయిన రాజు, బి.వెంకటరత్నం, బి. ప్రవీణ్‌కుమార్,పాల్గొన్నారు.

టీఆర్పీలో చేరిన బీజేపీ నాయకులు

పెన్‌పహాడ్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుబ్బతండా గ్రామ పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ లూనావత్ బోడియా (సంధ్య), భర్త నరహరి నాయక్, బీజేపీకి రాజీనామా చేసి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టి జానయ్యయాదవ్ సమక్షంలో టీఆర్పీలో సోమవారం చేరారు. అదేవిధంగా కాంగ్రెస్‌కు చెందిన భూక్య భీమ్లానాయక్, లునావత్ శంకర్, సూర్యాపేటకు చెందిన 43వార్డు బీఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షుడు ఎండీ సుల్తాన్ తదితరులు టీఆర్పీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లకూ కష్టం

దిగుబడి వస్తుందని లెక్కించినా 68,86,080 క్వింటాళ్ల పత్తి దిగుబడి రానుంది.

ఉమ్మడి జిల్లాలో 33 జిన్నింగ్ మిల్లులకే అనుమతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 42 జిన్నింగ్ మిల్లులు ఉండగా 33 మిల్లులకే పత్తి కొనుగోలుకు అనుమతిఇచ్చారు. యాదాద్రిభువనగిరి జిల్లాలో 12 జిన్నింగ్ మిల్లులు ఉండగా 12 మిల్లులకు కొనుగోలుకు అనుమతిఇచ్చారు. ఈ జిన్నింగ్ మిల్లుల్లో ఇప్పటివరకు సుమారు 87వేల క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేశారు. నల్లగొండ జిల్లాలో 24 జిన్నింగ్ మిల్లులు ఉండగా 23 మిల్లులను నోటిఫై చేశారు. అందులో 19 మిల్లులకే పత్తి కొనుగోలుకు అనుమతి ఇచ్చారు. ఈ మిల్లుల్లో ఇప్పటి వరకు 98,483 క్వింటాళ్ల పత్తి కొనుగోలు జరిగింది. సూర్యాపేట జిల్లాలో ఆరు జిన్నింగ్ మిల్లులు ఉండగా అందులో రెండింటికే అనుమతి ఇచ్చారు. ఆ రెండు మిల్లులు రెండు రోజుల క్రితమే కొనుగోళ్లు ప్రారంభించాయి. అన్ని జిన్నింగ్ మిల్లులకు అనుమతి ఇవ్వకపోవడంతో జిన్నింగ్ మిల్లుల యజమానులు నిరవధిక బంద్‌కు వెళ్లారు.

జిల్లాలో అన్ని జిన్నింగ్ మిల్లులకు అనుమతి ఇచ్చినప్పటికీ...

యాదాద్రిభువనగిరి జిల్లాలో 12 జిన్నింగ్ మిల్లులు ఉండగా సీసీఐ అన్ని మిల్లులో పత్తి కొనుగోలుకు అనుమతి ఇచ్చింది. ఇతర జిల్లాలో అన్ని మిల్లులకు అనుమతి ఇవ్వకుండా కొన్ని మిల్లులకే అనుమతి ఇచ్చారంటున్నారు. రాష్ట్ర కాటన్ అసోసియేషన్ నిర్ణయం మేరకు వారికి మద్దతుగా జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల యజమానులు కూడా బంద్ పాటిస్తున్నారు.

● సబిత, మార్కెటింగ్ యాదాద్రిభువనగిరి జిల్లా అధికారి

మిగిలిన పంట ఎవరికి విక్రయించాలి

రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశా. మొదటిసారి తీసినప్పుడు 10 క్వింటాళ్లు వచ్చింది. రెండోసారి, మూడోసారి దిగుబడి సమయానికి ఎకరానికి 7 క్వింటాళ్ల నిబంధనతో మిగిలిన పత్తి ఎవరికి విక్రయించాలనే ఆందోళనలో పడ్డాం.

● ఎర్రబోలు వెంకటరెడ్డి, చింతలపాలెం, పత్తి రైతు

అదనంగా రూ.1000 భారం

పత్తి మిల్లర్లను నిరవధిక బంద్ నిర్వహించే సంగతి తెలవక ట్రాక్టరులో చింత్రియాల గ్రామం నుంచి చింతలపాలెం మండలకేంద్రంలోని భారతమ్మ కాటన్ మిల్లు తెచ్చా. పత్తి దిగుమతి కాక ట్రాక్టర్లకు వెయిటింగ్ చార్జి అదనంగా రోజుకు రూ.1000 చొప్పున పడుతోంది.

● ఎర్రద్దుల సిద్ధారెడ్డి, చింతిర్యాల రైతు

నిబంధనలు సడలించాలి

జిన్నింగ్ మిల్లులను విభజించడం సరికాదు. కొత్తి మిల్లులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. గతంలో ఎకరానికి 12 క్వింటాళ్ల పరిమితి కాగా దానిని 7 తగ్గించడంతో రైతులతో నిత్యం గొడవలవుతున్నాయి. ఈ నిబంధనను సడలించాలి. అప్పటి వరకు బంద్ కొనసాగుతుంది.

● సంజీవరెడ్డి, భారతమ్మకాటన్ మిల్లు యజమాని, చింతలపాలెం

ఐక్యతను పెంపొందించే వన భోజనాలు



సూర్యాపేటలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

సూర్యాపేట టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా నిర్వహించే వన భోజనాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని వివేకానంద వృద్ధాశ్రమంలో నిర్వహించిన కార్తీక వనభోజనాల కార్యక్రమంలోపాల్గొని మాట్లాడారు. ఈ పవిత్ర మాసంలో కులమతాలకు అతీతంగా అందరి కుటుంబ సభ్యులతో కలిసి వనభోజనాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట-పాటలు పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఈగదయాకర్‌గుప్తా, గుడిపూడి వెంకటేశ్వర్‌రావు, సవరాల సత్యనారాయణ, తోట శ్యాం, రాచర్ల కమలాకర్, పోలెబోయిన నర్సయ్యయాదవ్ పెండెం చంద్రశేఖర్, గుండా లక్ష్మయ్య, కొండపల్లి లక్ష్మారెడ్డి, తెడ్ల కిశోర్, కిరణ్, తన్నీరు ప్రమీల, మిర్యాల వెంకటేశ్వర్లు, హరి పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



సామినేని రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మల్లు నాగార్జునరెడ్డి

సూర్యాపేట అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ భవన్‌లో సామినేని రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. వెనక్కి తీసుకున్న నల్ల చట్టాలను దొడ్డిదారిలో మళ్లీ ప్రవేశపెట్టేందుకు కేంద్రం చేస్తోందని అన్నారు. తుపాను ప్రభావంతో నష్టం వాటిల్లిన పంటలను సర్వే చేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందాల శంకర్‌రెడ్డి, దండ వెంకట్‌రెడ్డి, కొప్పుల రజిత, పల్లె వెంకట్‌రెడ్డి, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, దేవర వెంకట్‌రెడ్డి, టీకు సైద, బ్రహ్మం, రాంరెడ్డి, వీరాంజనేయులు, సుదర్శన్ పాల్గొన్నారు.